108లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు

కంకిపాడు: 108 వాహనాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు సంస్థ జిల్లా మేనేజర్ హరీష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 108 వాహనాల్లో ఈఎంటీ, పైలెట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 27న నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 27న మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి పక్కన గల నోబుల్ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం మాంసం విక్రయాలు నిషేధమని కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాంసం విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది నిఘా ఉంటుందన్నారు.



పార్టీ పటిష్టతకు ఐక్యంగా పనిచేయాలి



కంకిపాడు: పార్టీ పటిష్టతకు ఐక్యంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువత శనివారం దేవభక్తుని చక్రవర్తిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ అధికారపక్షం బెదిరింపులకు తలొగ్గేది లేదన్నారు. కార్యకర్తకు ఏ చిన్న కష్టం వచ్చినా అండగా నిలుస్తామన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని, ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు.

ఆపదలో ఉన్నవారికి అండగా వైఎస్సార్ సీపీ



కంకిపాడు: ఆపదలో ఉన్న కుటుంబాలను, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో శనివారం బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న షేక్ రేష్మా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రణీత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరి, ప్రజావ్యతిరేక విధానాలకు మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. కార్పొరేట్‌కు దీటుగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు ప్రభుత్వాసుపత్రుల్లో అందాయన్నారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.

23 కేజీల గంజాయి స్వాధీనం



పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఎ.శ్రీనివాసరావు, చిత్రంలో నిందితులు, వారి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి

12 మంది రవాణాదారుల అరెస్ట్

విజయవాడస్పోర్ట్స్: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న 12 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు సిటీ టాస్క్‌ఫోర్స్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.1.40 లక్షల ఖరీదైన 23 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. లా అండ్ ఆర్డర్ బృందాలతో కలిసి గంజాయి అక్రమ రవాణా, విక్రయం, కొనుగోలు అంశాలపై సమగ్ర దర్యాప్తు చేశామన్నారు. గతంలో పలు మాదక ద్రవ్యాల కేసుల్లో అరెస్ట్ కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితులపై నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు.

సొమ్ము పంచుకుంటుండగా పట్టివేత..

దీనిలో భాగంగానే కంకిపాడు గ్రామానికి చెందిన పెమ్మాడి మహేష్(సస్పెక్ట్ షీటర్), తెన్నేరు రోహిత్‌కుమార్, కాటూరి మహేష్, బొడ్డు ఉమేష్, గోసాలకు చెందిన పొలాన కిరణ్(సస్పెక్ట్ షీటర్), పోరంకికి చెందిన ఖగ్గా వెంకటతరుణ్(రౌడీ షీటర్), తాడిగడప గ్రామానికి చెందిన కొమ్మూరు సాయికిరణ్(రౌడీ షీటర్), విజయవాడ అయోధ్యనగర్‌కు చెందిన వల్లభనేని సాయిశ్రీరామ్(సస్పెక్ట్ షీటర్), భవానీపురానికి చెందిన షేక్ అక్బర్‌బాషా(సస్పెక్ట్ షీటర్), లెనిన్ నగర్‌కు చెందిన నాదెళ్ల తరుణ్‌చౌదరి(సస్పెక్ట్ షీటర్), మురళీనగర్‌కు చెందిన షేక్ ఫాతిమా, పూర్ణానందంపేటకు చెందిన దుంగల మురళీలను అరెస్ట్ చేశామని ఏడీసీపీ చెప్పారు. వీరందరూ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి అక్రమ రవాణా మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. గతంలో అనేక సార్లు జైలు జీవితం అనుభవించినా వీరి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లోని కొందరు వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేసి విజయవాడ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. గంజాయి విక్రయించగా వచ్చిన సొమ్మును హనుమాన్‌పేట సమీపంలోని ఓ పార్క్ వద్ద పంచుకుంటున్న వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గంజాయి సాగు, విక్రయం, సేవించడం, రవాణా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 91211 62475 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ సీఐలు శ్రీధర్, నాగశ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు త్వరలో ఇళ్ల స్థలాల పంపిణీ

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు అందించేందుకు కేబినెట్ ఆమోదించిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు అందించడానికి విధి విధానాలు రూపొందించడానికి రాష్ట్ర స్థాయిలో రెవెన్యూ శాఖామంత్రి ఆధ్వర్యంలో ఒక కమిటీ, జిల్లాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. గృహ నిర్మాణ యూనిట్ కాస్ట్ కూడా పెంచేందుకు కసరత్తు జరుగుతోందని చెప్పారు. గత టీడీపీ పాలనలో మాదిరిగానే ఇళ్లు నిర్మించుకునే ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ఇచ్చారో అదే మాదిరిగా ఇప్పుడు కూడా ఇవ్వాలన్న ఆదేశాలు త్వరలోనే ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు.

1న ఇళ్ల తాళాలు అందజేత..

ఫిబ్రవరి ఒకటో తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందించే కార్యక్రమం లాంఛనంగా ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన 1.14 లక్షల ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు తాళాలు అందజేస్తారన్నారు. పీఎంఏవై పథకంలో భాగంగా 7 లక్షల ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్‌కు పూర్తి చేయాలన్న లక్ష్యంగా పని చేస్తున్నామని మంత్రి చెప్పారు.



రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

గన్నవరం: స్థానిక సినిమా హాల్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని బుద్ధవరం గ్రామ శివారు రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గుర్రం శేషు(65) ఇళ్ల వెంట తిరుగుతూ అప్పడాలు, జంతికలు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సినిమా హాల్ సెంటర్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న అతడిని విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేషు ఛాతి భాగంపై లారీ ముందు టైర్లు ఎక్కడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో వ్యక్తి మృతి చెందడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాలు.. గన్నవరానికి చెందిన మల్లాది ప్రశాంత్ అతని అన్న శాంతికిరణ్(32)తో కలిసి కానూరు కొత్త ఆటోనగర్‌లో ఎస్ఎల్ఎస్ ఎర్త్ మూవర్ కంపెనీ పెట్టారు. శుక్రవారం శాంతికిరణ్ బైక్‌పై కంపెనీకి వెళ్లాడు. సాయంత్రం బైక్‌పై గన్నవరానికి బయలుదేరాడు. అతను 100 అడుగుల రోడ్డుపై కుక్క అడ్డు రావటంతో బ్రేక్ వేయగా అదుపు తప్పి గాయపడ్డాడు. స్థానికం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

ఘనంగా ముగిసిన యువజనోత్సవాలు



ఉషారామలో తెలుగమ్మాయి విజేతలతో రాంబ్రహ్మం

ఉంగుటూరు: విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిత్వం కలవారిగా తీర్చిదిద్దే లక్ష్యంతో యువజనోత్సవాలు ఏర్పాటు చేశామని కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ యువజనోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'తెలుగమ్మాయి' పోటీలలో పి.భార్గవి తెలుగమ్మాయిగా ప్రథమ స్థానంలో నిలిచారు. రసికాబేగం ద్వితీయస్థానం అనూష తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. అమ్మాయిల చలాకీతనం, సమయస్ఫూర్తి, తెలుగు సంస్కృతి పట్ల అవగాహన కల్పించడానికే నాలుగు రౌండ్ల పోటీలలో వివిధ కళాశాలకు చెందిన 84 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డ్యాన్స్, సింగింగ్, మిస్టర్ పర్‌ఫెక్ట్, స్పాట్ ఫొటోగ్రఫీ వంటి వివిధ పోటీలలో విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. కళాశాల చైర్మన్ రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్‌తో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని కన్వీనర్లు రామ్‌చౌదరి, నరేష్ సమన్వయం చేశారు.

కేవీ శివయ్యకు ఉత్తమ ఏఈఆర్వో అవార్డు



సీఎస్ నుంచి అవార్డు అందుకుంటున్న వెంకటశివయ్య

గన్నవరం: ఉత్తమ సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్వో)గా గన్నవరం తహసీల్దారు కట్ట వెంకటశివయ్య రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎన్నికల అభ్యాస పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా ఆయన ఉత్తమ అవార్డును అందుకున్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక ఓటర్ టర్న్‌ఔట్ సాధించడం, ఎమ్మెల్సీ ఎన్నికల ఎలక్ట్రోరల్ రోల్ చేయడం, ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణలో ఎలక్ట్రోరల్ రోల్ సిద్ధం చేయడంలో ఆయన సమర్థతను కనబరిచారు. దీనికిగాను ఎన్నికల సంఘం ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. తహసీల్దారు వెంకటశివయ్యకు కార్యాలయ అధికారులు, సిబ్బంది, పలు శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండల నున్న గ్రామంలో మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న బావిశెట్టి పెద్దిరావుకు ప్రభుత్వం ఉత్తమ అధికారి అవార్డును ప్రకటించింది. ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే గణతంత్ర వేడుకల్లో అవార్డును స్వీకరించేందుకు ఆహ్వానిస్తూ వైద్య శాఖ నుంచి సమాచారం అందింది.

కోలవెన్ను ఆయుర్వేద ఆసుపత్రిలో విచారణ



ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ వైద్యాధికారులు కె.లక్ష్మీసుధ, జవాద్‌ఖాన్

కంకిపాడు: కోలవెన్ను ఆయుర్వేద ఆసుపత్రిలో శనివారం అంతర్గత విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో గదుల కేటాయింపుపై కమిషనర్ కార్యాలయానికి అందిన ఫిర్యాదుతో శాఖాపరమైన విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఏలూరుకు చెందిన సీనియర్ వైద్యాధికారి కె.లక్ష్మీసుధ, మచిలీపట్నం వైద్యాధికారి జవాద్‌ఖాన్‌లు శనివారం విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో ఉన్న రికార్డులను, సిబ్బంది మధ్య వివాదాలపై వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా విచారణ బృందం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత వైద్యాధికారి హయాంలో కేంద్రం నుంచి విడుదలైన నిధులతో ఆసుపత్రి సమర్థంగా అమలు జరిగిందన్నారు. వైద్య సేవలు సజావుగా అందుతు న్నాయన్నారు. సేవలపైన ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి గతంలో ఉన్న గదిని మార్చటంలో వచ్చిన ఫిర్యాదుపైనే విచారణకు ఆదేశించటంతో తాము వివరాలు సేకరిస్తున్నామన్నారు. నిధులు వినియోగంలో ఎక్కడా సమస్య తలెత్తలేదన్నారు.

పూర్వ వైద్యాధికారిని నియమించాలి..

కోలవెన్ను ఆయుర్వేద ఆసుపత్రిలో వైద్యాధికారిగా పని చేసి డెప్యుటేషన్‌పై వెళ్లిన డాక్టర్ నీలిమను తిరిగి ఆసుపత్రి వైద్యాధికారిగా నియమించాలని స్థానికులు వినతిపత్రం అందించారు. వైద్యసేవలు సమర్థంగా అందాలంటే పూర్వ డాక్టర్ నీలిమను నియమించాలని విజ్ఞప్తిచేశారు.

సబ్‌జోన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గ స్థాయి సబ్‌జోన్ బాలుర ఆటల పోటీల్లో కంకిపాడు జెడ్పీ పాఠశాల క్రీడాకారులు సత్తా చాటారు. వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం జీబీకే సుధారాణి శనివారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో సబ్‌జోన్ పోటీలు జరిగాయన్నారు. జూనియర్స్ బాలుర విభాగంలో కబడ్డీలో ప్రథమస్థానం, సాఫ్ట్‌బాల్‌లో ద్వితీయ స్థానం, సీనియర్ బాలుర విభాగంలో సాఫ్ట్‌బాల్‌లో ప్రథమ స్థానం, షటిల్‌లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. జిల్లా స్థాయి గ్రిగ్ మెమోరియల్ పోటీలకు విద్యార్థులు అర్హత సాధించారన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు లకనం దుర్గాప్రసాద్, సత్తా చాటిన విద్యార్థులను ఎంఈఓ ప్రసాద్ అభినందించారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి

ఉంగుటూరు: వాహన చోదకులు హెల్మెట్ తప్పక ధరించాలని ఎస్ఐ యా గోవిందు సూచించారు. ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, వాహన చోదకులు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సీతారామ్, సిబ్బంది పాల్గొన్నారు.



క్లుప్తంగా

600 మందికి ఉచిత వైద్య పరీక్షలు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు ఎస్ఈఆర్ సెంటర్‌లో శనివారం ఫస్ట్ మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఫెలోషిప్ కార్య నిర్వహకులు సజ్జా ప్రసాదరావు శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 600 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యులు గౌతమ్, రమ్య, ప్రభు కుమార్, లక్ష్మీసింధూర, వెంగబాబు, ప్రజ్ఞశ్రీ, రఘురాం, లీలా కృష్ణ, దిలీప్ కుమార్, మెస్సీయ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు సజ్జా ఎలియాజరు, కన్వీనర్ కోడూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అజ్జంపూడి(గన్నవరం): మండలంలోని అజ్జంపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఫస్ట్ సోర్స్ సంస్థ సౌజన్యంతో ఉచిత మల్టీ స్పెషల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి కంచర్ల చిన్నా ప్రారంభించారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్‌కు చెందిన డాక్టర్ రాజేష్ నేతృత్వంలో పలువురు డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రోగులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో అజ్జంపూడి, బుద్ధవరం, కేసరపల్లికి చెందిన 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

మాస్టర్ ప్లాన్ అమలులో మాయ

- కానూరులో మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా రోడ్డు నిర్మాణం
- టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్వాకం
- భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకోని అధికారులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- అధికారుల తీరుపై గ్రామస్తుల విస్మయం



కానూరులో 60 అడుగులు వదిలి నిర్మించిన భవనం



కానూరులో 40 అడుగుల రోడ్డు వెడల్పుతో నిర్మిస్తున్న డ్రెయినేజీ

పెనమలూరు: కానూరులో మున్సిపాలిటీ అధికారులు మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా ప్రధాన రహదారి ఇరుపక్కల డ్రెయినేజీలు నిర్మిస్తున్నారు.ఈ రహదారి 60 అడుగులుగా మాస్టర్‌ప్లాన్‌లో ఉండగా నిబంధనలు తుంగలో తొక్కి టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి పాలకులు అండగా ఉండటంతో పరిస్థితులు గందరగోళంగా మారాయి.

వివరం ఇదీ..

కానూరు ప్రధాన రహదారి కామయ్యతోపు నుంచి గ్రామంలో శివాలయం శివారు వరకు విస్తరించి ఉంది. ఇప్పుడు ఈ రోడ్డు వెడల్పు 25 అడుగులకు మించి లేదు. పైగా గుంతలు పడి దారుణంగా ఉంది. ఈ రోడ్డుపై తరచుగా ట్రాఫిక్ అంతరాయంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కానూరు ప్రధాన రహదారిని విస్తరిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది.

60 అడుగుల రోడ్డు ఉండగా..

కానూరు ప్రధాన రహదారి వెడల్పు మాస్టర్‌ప్లాన్‌లో 60 అడుగులుగా ఉంది. ఈ మేరకు 1992, 2000, 2006 సంవత్సరాలలో జారీ చేసిన మాస్టర్‌ప్లాన్, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో రోడ్డు వెడల్పు 60 అడుగులుగా చూపారు. కొత్తగా భవనాలు నిర్మాణం చేస్తే 60 అడుగులు వదిలి భవన నిర్మాణాలు చేయాలి. గతంలో కానూరు గ్రామ పంచాయతీ ఉన్న కాలంలో 60 అడుగులు ఉంటేనే భవన ప్లాన్‌లు మంజూరు చేశారు. అయితే మున్సిపాలిటీ అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇదేమీ పట్టనట్లుగా 60 అడుగుల రోడ్డు వదలకుండా 40 అడుగుల వరకు రోడ్డు వదిలి రూ.2.35 కోట్లతో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా నిబంధనలు పాటించటంలేదు. దీంతో భవిష్యత్తులో కానూరు రోడ్డు విస్తరించే అవకాశం లేకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రోడ్డు ఉంటేనే సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు అంటున్నారు.

ఆర్డీపీ ఎందుకు అమలు చేయరు..

కానూరు రోడ్డు భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్డీపీ) టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు అమలు చేయటం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో కానూరు గ్రామానికి గ్రహణం పట్టుకునే ప్రమాదం ఏర్పడిందంటున్నారు.

విధానం ఇదీ..

ఆర్డీపీ ప్రకారం రోడ్డు 60 అడుగులు చేయాలంటే భూ యజమానులు ఎంత మేరకు స్థలం మున్సిపాలిటీకి ఇవ్వాలో టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేసి వివరాలు నమోదు చేయాలి. రోడ్డు కోసం వదిలిన స్థలానికి భూ యజమానులకు మున్సిపాలిటీ బాండ్లు జారీ చేయాలి. ఈ పనులు పూర్తి చేసిన తరువాత రోడ్డు 60 అడుగులు మార్కింగ్ చేసి డ్రెయినేజీ పనులు మొదలు పెట్టాలి.

దశదిశ లేకుండా..

అయితే టౌన్‌ప్లానింగ్ అధికారులు, ముఖ్యనేత, కమిషనర్ నిబంధనలను గాలికి వదిలి ఆగమేఘాలపై డ్రెయినేజీ నిర్మాణం పనులు దశదిశ లేకుండా చేపట్టారు. దీని కారణంగా రూ.2.35 కోట్లు నిధులు మట్టిపాలవ్వటమే కాకుండా, భవిష్యత్తులో సెంట్రల్ లైటింగ్‌తో కానూరు ప్రధాన రహదారి నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్న కల ప్రశ్నార్థకంగా మారిపోతుంది.

ఎవరి మెప్పుకోసమో..

టౌన్ ప్లానింగ్ అధికారుల అత్యుత్సాహం కారణంగా తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారుతోంది. నిబంధనలు తెలిసికూడా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు తప్పులు చేస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎవరి మెప్పు కోసం మాస్టర్ ప్లాన్‌కు తూట్లు పొడుస్తున్నారంటున్నారు. విధుల్లో అత్యుత్సాహం చూపితే భవిష్యత్తులో టౌన్‌ప్లానింగ్ అధికారులు చట్టప్రకారం ఇబ్బందులు పడతారని నిపుణులు తెలుపుతున్నారు.

చెత్త సమస్యపై స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్



డ్రెయిన్ నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత, సర్పంచ్ పూర్ణ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో 'అటకెక్కిన పారిశుధ్యం' శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని రామయ్య చెరువు వద్ద చెత్త గుట్టలుగా పేరుకుపోతుందని, చెరువు ఆక్రమణలకు గురై కలుషితమవుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రెయిన్ పూడుకుయిందని సమస్యలను వివరిస్తూ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత, సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు శనివారం రామయ్య చెరువు వద్ద డ్రెయిన్‌ను, చెత్త డంప్‌ను పరిశీలించారు. మురుగు సజావుగా పారుదల అయ్యేందుకు వీలుగా డ్రెయిన్ నిర్మాణానికి సర్వే చేసి కొలతలు తీసుకున్నారు. శ్వేత మాట్లాడుతూ నల్లూరివారి కట్ట వద్ద డ్రెయిన్ ప్రారంభం నుంచి నూతన డ్రెయిన్ నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మురుగు సజావుగా పారేందుకు వీలుగా ఇరువైపులా సిమెంట్ గోడలతో అడుగున ప్లాస్టింగ్ వర్క్‌తో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. చెత్త డంపింగ్ నివారించడానికి గ్రామంలో టాంటాం నిర్వహించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా పంచాయతీ అధికారులకు సూచించామన్నారు. సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త కుప్పలను జేసీబీ సహాయంతో తొలగిస్తామన్నారు. ఇకపై చెత్త డంప్ చేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

వక్ఫ్ భూమి ఆక్రమణలపై ఫిర్యాదు



తాడిగడపలో వక్ఫ్ భూమి రికార్డును పరిశీలిస్తున్న అధికారులు

పెనమలూరు: తాడిగడప, పెదపులిపాక గ్రామాలలో అత్యంత విలువైన వక్ఫ్ భూమిలోకి పలువురు వ్యక్తులు ఆక్రమంగా ప్రవేశించి చట్ట విరుద్ధ పనులు చేస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఎండి.నుహుఅలీషా పెనమలూరు తహసీల్దార్ గోపాలకృష్ణ, పెనమలూరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదులో వివరాలు తెలుపుతూ పెదపులిపాక, తాడిగడప గ్రామాలలో వక్ఫ్ భూమి 42.86 ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఈ నెల 31వ తేదీన వక్ఫ్ భూములకు తహసీల్దార్ గోపాలకృష్ణ ఏక్‌సాల్ లీజుకు వేలంపాట నిర్వహించాలని ఆదేశించారన్నారు. అయితే పెదపులిపాక గ్రామానికి చెందిన ముసునూరు శ్రీనివాసరావు, చోడవరానికి చెందిన టి.శ్రీనివాసరావు, మరో 13 మంది వ్యక్తులు అక్రమంగా వక్ఫ్ భూముల్లోకి ప్రవేశించారన్నారు. వక్ఫ్ భూముల్లో చట్ట విరుద్ధ కార్యక్రమాలు జరగకుండా, భూములకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వక్ఫ్ భూముల్లో ప్రవేశించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ నెల 31వ తేదీన లీజు వేలం పాట సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాగా వక్ఫ్ భూములను శనివారం ఉదయం ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఎండి.నుహుఅలీషా, వీఆర్వో సుధీర్, ఖాజీ ఎండీ.హబీబుల్లాహసన్, ఎండి.కరీముల్లా పలువురు పరిశీలించారు.

28న మెగా జాబ్‌మేళా

గన్నవరం: స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో ఈ నెల 28న అమరరాజా గ్రూపు సంస్థల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్మీడియెట్, ఐటీఐ చదివిన నిరుద్యోగ యువతకు మిషన్ ఆపరేటర్ ఉద్యోగాలకు వెయ్యి మంది వరకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజల చేతిలో బలమైన ఆయుధం ఓటు



నున్నలో సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెనమలూరులో వృద్ధ ఓటరును సన్మానిస్తున్న ఆర్డీవో హేలాషారోన్

నున్న(విజయవాడరూరల్): ప్రజాస్వామ్యం ప్రజలకు ఇచ్చిన బలమైన ఆయుధం ఓటుహక్కు అని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సీనియర్ సిటిజన్, రిటైర్డు ఉపాధ్యాయిని వెంపటి సీతామహాలక్ష్మి, గౌరీశంకర్ దంపతులను వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించారు. గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాతపాడు(విజయవాడరూరల్): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం పాతపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్లను గ్రామ సర్పంచి దేవగిరి సుజాత సత్కరించారు. ఓటు హక్కు సద్వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. దేవగిరి ఓంకార్‌రెడ్డి, కార్యదర్శి కోటిలింగమ్మ, బీఎల్ఓలు కె.సతీష్, ఎం.సజినీరాణి, ఎండీ.అంరిన్, తిరుపతిరావు, వీఆర్వో గోపి పాల్గొన్నారు.

కంకిపాడు: ఓటు హక్కు వజ్రాయుధం అని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం ఓటర్ల దినోత్సవం జెడ్పీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సీనియర్ ఓటర్లను సత్కరించి, కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. తహసీల్దార్ భావనారాయణ, డీటీ శ్రీనివాసరావు,ఎంఈఓ ప్రసాద్, హెచ్ఎం జీబీకే సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు పాల్గొన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఓటర్ల దినోత్సవాన్ని ఉయ్యూరులో శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ శేషగిరిరావు ఓటర్లతోప్రతిజ్ఞ చేయించారు. ఏజీఅండ్ఎస్‌జి సిద్దార్థ కళాశాలలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సత్కరించి కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అందించారు. తహసీల్దార్ సురేష్ బాబు, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో శనివారం తహసీల్దారు కె.వెంకటశివయ్య నేతృత్వంలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. హైస్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. మానవహారం జరిపారు. పలు పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు. నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి షేక్ షాహిద్‌బాబు చేతుల మీదుగా అవార్డులను, సర్టిఫికెట్లను అందజేశారు.

పెనమలూరు: ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించ గలుగుతామని ఆర్డీవో హేలాషారోన్ అన్నారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వృద్ధ ఓటర్లకు సన్మానం, విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు, నూతన ఓటర్లకు ఓటు గుర్తింపు కార్డులు అందజేశారు. ఉత్తమ సేవలు అందించిన 50 మంది బూత్‌లెవల్ అధికారులను సన్మానించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంఈవో కనకమహాలక్ష్మి, హెచ్ఎం దుర్గాభవాని, ఎన్నికల విభాగపు అధికారి రాజు పాల్గొన్నారు. కానూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.వెంకటేశ్వరరావు, మున్సిపాలిటీ కమిషనర్ భవానిప్రసాద్, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్, రిజిస్ట్రార్ రవిచంద్, ఎన్ఎస్ఎస్ అధికారి కొల్లా నరేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బాపులపాడు హైస్కూళ్లలో శనివారం నిర్వహించారు. విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతను బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణ వివరించారు. అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించి, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఎంపీడీవో కంబాల జోగేశ్వరరావు, ఎంఈవో శ్రీరామ్ బాలసింగ్, డిప్యూటీ తహసీల్దార్ అంకాలు, వీఆర్వోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.కృపానందం పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పెనమలూరు: గంగూరులో ప్రధాన రహదారి నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.21 లక్షలు కేటాయించామన్నారు. గ్రామాలలో రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కోయా ఆనంద్‌ప్రసాద్, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, అక్బర్‌పాషా, అబ్దుల్ సలాం, అబ్దుల్ గౌస్, ఇర్ఫాన్‌పాషా, బంగారు నాగేంద్ర, పల్లి సందీప్ వార్డు సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

ముగిసిన బాలుర సబ్ జోన్ ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గత రెండు రోజులుగా జరుగుతున్న బాలుర సబ్ జోన్ ఆటల పోటీలు శనివారం ముగిశాయి. చివరి రోజున బాలుర జూనియర్ విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టెన్నికాయిట్, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. సబ్ జోన్ పరిధిలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన 300 మంది జూనియర్ బాలురు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు వెళ్తారని నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్, సబ్ జోన్ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, పీఈటీలు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో వ్యక్తి అరెస్ట్

ఉయ్యూరు: బాలికను కిడ్నాప్ చేసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని ఉయ్యూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఉయ్యూరు పట్టణ సర్కిల్ కార్యాలయంలో సీఐ టీవీవీ రామారావు విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ కథనం మేరకు పట్టణానికి చెందిన బాలిక(17)ను గుడివాడ పట్టణానికి చెందిన కొడాలి నాగబాబు ఇన్‌స్టాగామ్‌లో పరిచయం చేసుకుని చనువుగా ఉంటున్నాడు. ఈ నెల 14న బాలికను తీసుకువెళ్లి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తొలుత కిడ్నాప్ కేసును నమోదు చేసిన పోలీసులు కేసు విచారణ సాగించారు. దర్యాప్తులో భాగంగా నాగబాబును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. కిడ్నాప్, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరుపరిచారు. సమావేశంలో ఎస్ఐ విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి రథయాత్ర

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో శనివారం అయ్యప్పస్వామి రథయాత్ర ఘనంగా చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అయ్యప్పస్వామిని అలంకరించి వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించి పూజలు, భజనలు చేశారు. పెనమలూరు గ్రామంలో అయ్యప్పస్వామి అన్నమారాధన నిర్వహించనున్నారు. అయ్యప్ప భక్తుల సహకారంతో ఆదివారం గ్రామంలో అన్నసమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పశు ఆరోగ్య పరీక్షలు

ఉంగుటూరు: కొయ్యగూరపాడు, తుట్టగుంట గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 75 పశువులకు వైద్య పరీక్షలు, 44 దూడలు, 65 గేదెలకు, 150 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందజేశారు. కొయ్యగూరపాడులో డాక్టర్ మల్లిబాబు, తుట్టగుంటలో డాక్టర్ స్వర్ణలత పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని శనివారం సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాస్ ప్రారంభించారు. డాక్టర్ మేరీ వైడూర్యం మాట్లాడుతూ 35 దూడలకు, 90 గొర్రెలకు నట్టల నివారణ మందు, 52 గేదెలకు వైద్య పరీక్షలు చేసి మందులు, మినరల్ మిక్చర్ అందజేశారు. జెవీవోలు శ్రీనివాసరావు, రాజకుమారి, హుస్సేన్, రంగారావు, సాయి పాల్గొన్నారు. కొత్తగూడెంలో డాక్టర్ రెడ్డమ్మ ఆధ్వర్యంలో శిబిరం జరిగింది.

సాంకేతికతతోనే సుస్థిర అభివృద్ధి

పెనమలూరు: సాంకేతికతతోనే సుస్థిర అభివృద్ధి సాధించగలుగుతామని హైదరాబాద్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహాన్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో శనివారం రీసెర్చ్ కాన్క్లేవ్- 2025 కార్యక్రమంలో శనివారం ఆయన ప్రసంగించారు. రిమోట్ సెన్సింగ్, స్పేస్ టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. తిరుపతి నవవిష్కర్ ఐఐటీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాత్స మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యం సాధించాలన్నారు. చాన్స్‌లర్ కేవీ చౌదరి, వైస్‌చాన్సలర్ పి.వెంకటేశ్వరరావు, ప్రోవెస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.